

మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు



అన్నారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేటీఆర్



మేడిగడ్డకు చేరుకున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, కౌశిక్ రెడ్డి, తదితరులు

కేసీఆర్‌పై కోపంతో.. రైతులపై పగబట్టకండి

కాళేశ్వరం ప్రాజెక్టు యాత్రలో బీఆర్ఎస్ నేతలు కడియం, కేటీఆర్, హరీశ్

- మేడిగడ్డకు మరమ్మతులు చేయించి.. నీళ్లను లిఫ్ట్ చేయండి
- 3 పిల్లర్లకు సమస్య వస్తే.. కాళేశ్వరం మొత్తం నష్టపోయిందని బద్నాం చేస్తున్నరు
- రైతులకు కామధేనువు లాంటిది కాళేశ్వరం

'కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు కామధేనువు. అటువంటి కాళేశ్వరాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయండి. నీళ్లను వెంటనే లిఫ్ట్ చేసి రైతులకు అందించండి. నల్లగొండ సభలో కేసీఆర్ ఇచ్చిన మాట మేరకు బీఆర్ఎస్ నేతలమంతా మేడిగడ్డకు వచ్చాం. ప్రాజెక్టు రక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వమే గోబెల్స్ ప్రచారం నిర్వహిస్తున్నది. దాన్ని అడ్డుకుని ప్రజలకు వాస్తవాలు వివరించేందుకే ఇక్కడికి వచ్చాం. 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 273 కిలోమీటర్ల పొడవైన టన్నెల్స్, 1500 కిలోమీటర్లకు పైగా ఉండే కాలువలు కలిగిన భారీ ప్రాజెక్టు కాళేశ్వరంలో కేవలం మేడిగడ్డ బ్యారేజీలో 3 పిల్లర్లకు సమస్యలు వస్తే రాద్ధాంతం చేస్తున్నారు' అని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ వైఖరిని తూర్పారబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారంపై వాస్తవాలు ప్రజలకు తెలియజెప్పేందుకు బీఆర్ఎస్ నేతలు శుక్రవారం చేపట్టిన చలో కాళేశ్వరంలో భాగంగా ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, కడియం శ్రీహరి మాట్లాడారు. కేసీఆర్‌పై కోపముంటే ఆ కోపాన్ని దయచేసి రైతులపై రాష్ట్రంపై చూపవద్దని వారు కోరారు. ఆలస్యం చేయకుండా మేడిగడ్డకు మరమ్మతులు చేయించి రైతులకు సకాలంలో నీళ్లు అందేలా చూడాలని చెప్పారు.

మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, తదితరులు



మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ నామ నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, తదితరులు

ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గండ్ర వెంకటరమణా రెడ్డి, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, దేవిప్రసాద్, తదితరులు



మేడిగడ్డ వద్ద కేటీఆర్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, గంగుల కమలాకర్, తదితరులు

బీసీల డిమాండ్లను అమలుచేయాలి : ఆర్.కృష్ణయ్య

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, తదితరులు

కాచిగూడ, మార్చి 1 : కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో చేర్చిన బీసీల డిమాండ్‌లను వెంటనే అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ఇస్తున్న మాదిరిగా బీసీ, ఈబీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు మంజూరు చేయాలని కోరుతూ జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్.కృష్ణయ్య వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో గుజ్జ కృష్ణ, నీలం వెంకటేశ్, వేముల రామకృష్ణ, అనంతయ్య, ఉదయ్, తదితరులు ఉన్నారు.

మృతిచెందిన హోంగార్డు కుటుంబానికి రూ.30లక్షలు అందజేత

సిటీబ్యూరో, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డ్ కుటుంబానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారులు చేయూత అందించారు. వివరాల్లోకి వెళితే... మేడ్చల్ ట్రాఫిక్ పీఎస్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.మారుతి గత సంవత్సరం నవంబర్ 7న రావల్‌కోల్ కమాన్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బ్యాంక్ అధికారులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సాలరీ అకౌంట్ ప్యాకేజి యాక్సిడెంటల్ డెత్ ఇన్సూరెన్స్ కవరేజ్ కింద హోంగార్డ్ కుటుంబానికి రూ.30లక్షల చెక్కును సైబరాబాద్ పోలీసు జాయింట్ కమిషనర్(ట్రాఫిక్)జోయల్ డేవిస్ చేతుల మీదుగా హోంగార్డు భార్య భాగ్యలక్ష్మికి అందచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ కందికొండ, అదనపు డీసీపీ రవిచందన్‌రెడ్డి, కార్ హెడ్‌క్వార్టర్స్ అదనపు డీసీపీ షమీర్, హోమ్ గార్డ్స్ ఏసీపీ కృష్ణ తదితరులున్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

దేశంలోనే అగ్రగామిగా తెలంగాణను నిలిపేందుకు కృషి : మంత్రి జూపల్లి

నిథిమ్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి జూపల్లి

కొండాపూర్, మార్చి 1 : ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయికి తెలంగాణ పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ (నిథిమ్)తో పాటు మాదాపూర్‌లోని శిల్పారామంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిల్పారామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పర్యాటక, ఉన్నత విద్యా, శిక్షణ సంస్థగా నిథిమ్‌ను తీర్చిదిద్దుతామన్నారు. శిల్పారామం ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ, నిథిమ్ డైరెక్టర్ నిఖిల, టీఎస్టీడీసీ ఎండీ రమేశ్ నాయుడు, శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు, నిథిమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మిషెల్ ఫ్రాన్సిస్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పురుగుపట్టిన పప్పు

పురుగులు పట్టిన కందిపప్పు

బేగంపేట్, మార్చి 1 : అంగన్‌వాడీ సెంటర్‌లలో పుచ్చుపట్టిన పప్పు దినుసులు సరఫరా అవుతున్నాయి. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని గైదిన్ బాగ్ కేంద్రంలో రెగ్యులర్‌గా సరుకులు సరఫరా అవ్వకపోవడంతో మరో సెంటర్ నుంచి పప్పు దినుసులు తీసుకువచ్చారు. ప్యాకెట్‌ను విప్పి చూడగా పప్పంతా పూర్తిగా పురుగులు పట్టి ఉన్నది. దీంతో అక్కడి సెంటర్ నిర్వాహకురాలు చేసేది లేక తమ ఇంటి నుంచి పప్పు దినుసులు తీసుకువచ్చి పిల్లలకు భోజనం తయారు చేసి పెట్టారు. ఇలా సరుకులు రెగ్యులర్‌గా రాకపోవడంతో పాటు పాడైన సరుకులు సరఫరా కావడంతో అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

పోలీసు గుర్రాల దాణాకు టెండర్లు

సిటీబ్యూరో, మార్చి 1(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మౌంటెడ్ విభాగంలో ఉన్న 40 గుర్రాలకు అవసరమైన ఆహార, సపర్యలు చేసే వస్తువులను సరఫరా చేసేందుకు పోలీసులు టెండర్లు ఆహ్వానించారు. పేట్ల బుర్జులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లోని పోలీసు గుర్రాల నిర్వహణకు కావాల్సిన ఆహార దాణా, సబ్బులు, నూనెల వంటి వస్తువులను సరఫరా చేయాల్సి ఉండగా... రేపటి నుంచి మార్చి 12 వరకు టెండర్లు స్వీకరించనున్నట్లుగా సీఏఆర్ జాయింట్ కమిషనర్ జారీ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అర్హత కలిగిన కాంట్రాక్టర్ల నుంచి స్వీకరించిన షీల్డ్ టెండర్లను ఈ నెల 14న ఓపెన్ చేయనున్నట్లుగా అధికారులు తెలిపారు.

200 కోట్ల విలువైన.. ప్రభుత్వ భూమి కబ్జా

జూబ్లీహిల్స్‌లో రెచ్చిపోతున్న కబ్జాదారులు

- రెండెకరాల స్థలంపై కన్నేసిన అక్రమార్కులు
- ప్రభుత్వ బోర్డులు తొలగించి ప్రైవేటు బోర్డులు ఏర్పాటు
- కాపలాగా రౌడీల ఏర్పాటు
- మా దృష్టికి రాలేదంటున్న తాసీల్దార్

జూబ్లీహిల్స్ రోడ్ నెం 70లోని దేవరకొండ నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో ఇటీవల వెలిసిన ఓ ప్రైవేటు సంస్థకు చెందిన బోర్డు

బంజారాహిల్స్, మార్చి 1 : కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. రెవెన్యూ అధికారుల తీరుతో ప్రభుత్వ భూములను కర్పూరంలా కరిగిపోతున్నాయి. భూ బకాసూరులు ఏకంగా ప్రభుత్వ హెచ్చరిక బోర్డును తొలగించి దర్జాగా సొంత స్థలం అంటూ బోర్డులు పెట్టి రౌడీలను కాపలాగా ఉంచారు. ఇదేమిటని ప్రశ్నిస్తే రౌడీలచే దౌర్జన్యానికి దిగుతున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. షేక్‌పేట మండల పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నెం 70లో జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీకి, అశ్విని లే అవుట్‌కు మధ్యన పాలపిట్ట జంక్షన్‌కు ఎడమ వైపున షేక్‌పేట మండల సర్వే నంబర్ 403/పీలోని టీఎస్ నెం-1, బ్లాక్ ఎఫ్, వార్డు -9లో సుమారు 2ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ స్థలాన్ని డాట్ పబ్లికేషన్స్ అనే సంస్థకు కేటాయించగా నిర్ణీత సమయంలో దాన్ని వినియోగించుకోలేదు. దీంతో స్థలాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుని ల్యాండ్‌బ్యాంక్‌లో ఉంచి ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసింది. దీంతో సదరు సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

బోగస్ పత్రాలు సృష్టించి..!

సుమారు 200 కోట్ల విలువైన ఈ స్థలంపై కన్నేసిన కొంతమంది వ్యక్తులు బోగస్ పత్రాలు సృష్టించి గత కొన్నేళ్లుగా కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. అభిషేక్ ఆవాలా అనే వ్యక్తితో పాటు మరికొంత మంది వ్యక్తులు తాము ఈ ప్లాట్లను కొనుగోలు చేశామంటూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్థలంలోకి ప్రవేశించడంతో పాటు ఏకంగా బ్లూషీట్లు ఏర్పాటు చేశారు. తాత్కాలిక గదులు నిర్మించారు. రెవెన్యూ అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉండడంతో కబ్జాలను పట్టించుకోలేదు. కాగా ఎన్నికలు ముగిసిన తర్వాత ఖరీదైన స్థలం కబ్జాకు గురైందంటూ ఫిర్యాదులు రావడంతో గత ఏడాది డిసెంబర్ 12న షేక్‌పేట్ మండల తహసీల్దార్ అనితారెడ్డి ఆదేశాలతో సిబ్బంది రంగంలోకి దిగి జేసీబీల సాయంతో ఆక్రమణలను తొలగించారు. ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు స్థలం కబ్జాకు యత్నిస్తున్న అభిషేక్ ఆవాలా అనే వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అభిషేక్‌పై క్రిమినల్ కేసు నమోదైయింది.

మరోసారి కబ్జాకు పక్కా స్కెచ్..

రెండు నెలల కిందట ప్రభుత్వ స్థలం ఆక్రమించేందుకు వేసిన ప్లాన్ బెడిసికొట్టడంతో తాజాగా మరోసారి అక్రమార్కులు రంగంలోకి దిగారు. రాత్రికి రాత్రే అక్కడున్న మూడు ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను తొలగించడంతో పాటు ఓ ప్రైవేటు నిర్మాణ సంస్థ పేరుతో బోర్డులను ఏర్పాటు చేశారు. స్థలంలోకి ఎవరూ రాకుండా ప్రైవేటు వ్యక్తులను కాపలాగా ఉంచారు. పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు బిజిగా ఉంటారని, ఎన్నికలు ముగిసేలోగా తమ కబ్జా వ్యవహారం చక్కబెట్టుకోవాలని బావిస్తున్నట్లు తెలుస్తున్నది. సుమారు పదేళ్లుగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న రెండెకరాల స్థలాన్ని ప్రైవేటు వ్యక్తుల పరం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు

జూబ్లీహిల్స్ రోడ్ నెం 70లో రెండు ఎకరాల స్థలం ఆక్రమణకు గురైన విషయం తమ దృష్టి రాలేదు. గతంలో ఆక్రమణలను గుర్తించిన తాము కూల్చివేతలు చేపట్టాం. ఆక్రమణ దారులపై క్రిమినల్ కేసు కూడా పెట్టించాం.

-అనితారెడ్డి, షేక్‌పేట తహసీల్దార్

స్టేడియానికి కేటాయించిన స్థలం కబ్జా

స్టేడియానికి కేటాయించిన స్థలంలో వెలిసిన షెడ్డు, కబ్జాదారుడు శ్రీనివాస్‌రెడ్డి

జవహర్‌నగర్, మార్చి 1 : కబ్జాదారులు ప్రభుత్వ భూములను మింగేస్తున్నారు. ఈ విషయమై గతంలో కాప్రా తహసీల్దార్‌గా పనిచేసిన మతిన్ జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాప్రా జమ్మిగడ్డ ప్రాంతం సర్వే నెం. 199/1లో స్టేడియానికి కేటాయించిన స్థలంలో సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ధర్జాగా బోరు, షెడ్డు వేసి ఆక్రమించాడు. మతిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక యాప్

సిటీబ్యూరో, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : పట్టణ ప్రాంతాల్లో ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నామని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ గ్రాంట్‌గా ఇచ్చిన నిధులతో 'టెక్నాలజీస్ ఫర్ అర్బన్ ట్రాన్సిట్ టూ ఎన్‌హన్స్ మొబిలిటీ అండ్ సేఫ్ యాక్సెసిబిలిటీ' అనే అంశంపై చేపట్టిన ప్రాజెక్టుపై వర్క్‌షాపును శుక్రవారం బేగంపేటలోని మెట్రో రైలు భవన్‌లో నిర్వహించారు.ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా రూపొందించే ఈ యాప్‌నకు హైదరాబాద్ బిట్స్ ఫిలానీ, ఐఐటీ బాంబే, ఐఐటీ ఖరగ్‌పూర్ సహకారం ఉందన్నారు. అడిషనల్ డీజీపీ శిఖా గోయల్ పాల్గొన్నారు.

రివాల్యుయేషన్ దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 1 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి, ఈ నెల 5వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి 7వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పీజీ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఓయూ పరిధిలోని ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్డబ్ల్యూ, ఎంలిబ్ఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 12వ తేదీ నుంచి, ఎమ్మెస్సీ (అప్లైడ్ న్యూట్రిషన్), ఎమ్మెస్సీ (స్పోర్ట్స్ న్యూట్రిషన్) మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

పరీక్షా ఫలితాలు విడుదల

యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ వన్‌టైం చాన్స్, ఎంఫిల్ రిహాబిలిటేషన్ సైకాలజీ పార్ట్ 1, 2 పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.